
క్లుప్తంగా

ఘనంగా లక్ష తులసి పూజ



గూడూరు: ధనుర్మాసం పురస్కరించుకుని గూడూరులో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ మాధవ స్వామి ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో లక్ష తులసి పూజా మహోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాన్ని అర్చకుడు గంజాం సీతారామాచార్యులు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, స్నపన పూజా కార్యక్రమాల అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తులసి ఆరాధన, శాంతి హోమాలు చేశారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద పారాయణ అనంతరం స్వామి వారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కొనసాగుతున్న సుందరకాండ మహాయజ్ఞం



మచిలీపట్నంటౌన్: స్థానిక మాచవరంలోని శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సుందరకాండ మహాయజ్ఞం గురువారం రెండోరోజుకు చేరింది. ఆలయంలో పుత్రకామేష్టి హోమాన్ని కూడా నిర్వహించారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న హోమాన్ని చలమలశెట్టి సంజీవమ్మ, అర్చకులు మేడూరి చక్రవర్తుల శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో ఇటికాల చంద్రశేఖర్‌శాస్త్రి బ్రహ్మత్వంలో నిర్వహించారు. సాయంత్రం పాక్కునూరి శ్రీనివాసశర్మ సుందరకాండ ప్రవచనం చేశారు. పోతుకుచి ఆంజనేయ కుమార్, పాక్కునూరి ఉదయభాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఇరుముడులు



కోడూరు: నలభై రోజుల పాటు కఠోర దీక్ష చేసిన అయ్యప్ప మాల ధరించిన దీక్షపరుల ఇరుముడి కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీవర్స్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వివిధ గ్రామాలకు చెందిన 40 మంది దీక్షాధారులకు ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి ఇరుముడిని కట్టారు. దేవాలయం వద్ద అన్నసమారాధన చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫ్లెక్సీల తొలగింపు




పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తొలగించారు. మండల పరిధిలోని పులిగడ్డ నుంచి అవనిగడ్డ వరకూ ప్రధాన రహదారిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. మలుపులు, ప్రధాన సెంటర్లతో పాటు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పోలీస్, పంచాయితీ, రెవెన్యూ, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

బంటుమిల్లి: పెందుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల, బంటుమిల్లి జూనియర్ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కిశోరవికాసం కార్యక్రమాల్లో భాగంగా పోక్సో చట్టం, బాల్య వివాహాలు, హింసాత్మక వేధింపులు తదితర విషయాలు, చట్టాలపై ఆయా గ్రామాల వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల రక్షణ కోసం కమిటీలను నియమించారు.

పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బందికి దుస్తుల పంపిణీ



మోపిదేవి: మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 15 మంది కాంట్రాక్టు సిబ్బందికి నూతన దుస్తులను సర్పంచ్ నందిగం మేరీరాణిఅందజేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని వీటిని అందజేసినట్లు గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మించారు.. వసతులు మరిచారు

- బంటుమల్లి, చినపాండ్రాకలో షాదీకి నోచుకోని షాదీఖానాలు
- ప్రజాధనం నిరుపయోగం
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం



చినపాండ్రాకలో షాదీఖానా



బంటుమిల్లిలో షాదీఖానా

బంటుమిల్లి: షాదీఖానాలు నిర్మించారుగానీ.. వసతుల ఏర్పాటులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా ముస్లింలకు అందుబాటులోకి రాలేదు. బంటుమిల్లితోపాటు కృత్తివెన్ను మండలం చినపాండ్రాకలో లక్షలాది రూపాయలతో ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానాలు ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. బంటుమిల్లి, చినపాండ్రాక గ్రామాల్లో ముస్లింలు అత్యధికంగా ఉన్నారు. వీరికి స్థానికంగా శుభకార్యాలు చేసుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో 2004లో నాటి టీడీపీ ప్రభుత్వం మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్క షాదీఖానా నిర్మాణానికి సుమారు రూ. 11 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. వీటితో నిర్మాణం పూర్తయ్యాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 2008లో ప్రారంభోత్సవాలు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా మిగిలిన పనులు పూర్తికాక మౌలిక వసతులు నీరు, డ్రైనేజీ, ప్రహరీ తదితర సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారాయి. దీంతో ఇప్పటి వరకు ఒక్క షాదీ వాటిలో జరిగిన దాఖలాలు లేవు.

ఏళ్లు గడుస్తున్నా..

లక్షలాది రూపాయల ప్రజాధనంతో బంటుమిల్లి, చినపాండ్రాక గ్రామాల్లో షాదీఖానాలు నిర్మించిన సంవత్సరాలు గడుస్తున్న నీటి సౌకర్యం, డ్రైనేజీ లేదు. బంటుమిల్లిలో ప్రహరీ లేదు. చినపాండ్రాకలో వంట షెడ్డు శిథిలమై కూలిపోగా దాని పైపులు ఎత్తుకెళ్లారు. కరెంట్ బోర్డులు పగలకొట్టారు. బంటుమిల్లి షాదీఖానా కరెంట్ బిల్లు మసీద్ కమిటీ సభ్యులు కడుతున్నారు.

నిర్మాణాల్లో మందుబాబులు, అల్లరిమూకల తిష్ట

దాదాపు 15 సంవత్సరాలుగా షాదీఖానాలు వినియోగంలేకపోవడంతో మందుబాబులకు, అల్లరిమూకలకు అసాంఘిక శక్తులకు నిలయాలుగా మారాయి. బంటుమిల్లిలో గణేష్‌కాలనీ సమీపంలో, చినపాండ్రాక గ్రామ శివారులో ఉండటంతో మందుబాబులకు అనుకూలంగా ఉన్నాయి. సరైన రక్షణ లేక ఆవరణంతా పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తుంటాయి. చినపాండ్రాకలో ఒక వ్యాపారి షాదీఖానాను తన ఆధీనంలో ఉంచుకుని ధాన్యం గోడౌన్‌గా తాను చేసే నిర్మాణ పనుల సామగ్రి నిలువ చేసుకునేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం. బంటుమిల్లి మసీదు మరమ్మతుల సమయంలో కమిటీ సభ్యులు వాటికి మరమ్మతులు చేసి కొద్ది రోజులు ప్రార్థనలకు వినియోగించారు. బంటుమిల్లి–1 సచివాలయ భవనం నిర్మాణ సమయంలో అద్దెకు అందులో సచివాలయం నిర్వహించారు. సచివాలయం కొత్త భవనంలోకి మారిన తర్వాత పరిస్థితులు యథాతథమయ్యాయి. బంటుమిల్లి, చినపాండ్రాక గ్రామాల్లో మైనార్టీ ముస్లింలు లక్షాధికారులున్నా షాదీఖానాల అభివృద్ధికి ముందుకు రావడంలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన షాదీఖానాలు వినియోగంలోకి తెచ్చి శుభకార్యాలు నిర్వహించడానికి మసీద్ కమిటీలు శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా వాటిలో వసతులు కల్పించి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాల్సి ఉంది.



శిథిలమై పడిపోయిన చినపాండ్రాక వంట షెడ్డు

సరైన సదుపాయాలు లేవు



బంటుమిల్లి, చినపాండ్రాక గ్రామాల్లో అప్పటి ప్రభుత్వాలు షాదీఖానాలు నిర్మించినా పూర్తి స్థాయిలో సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. షాదీఖానాల్లో మౌలికసౌకర్యాలు ఏర్పాటు చేయడం మసీదు కమిటీలకు ఖర్చుతో కూడిన పని.

–ఎండీ కమాల్‌బాషా, మసీద్ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ, బంటుమిల్లి

నేటి నుంచి ఎస్‌ఎంసీ సభ్యులకు శిక్షణ

గూడూరు: మండలంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గూడూరు మండల విద్యాశాఖ అధికారులు బి.ఎస్.సి.శేఖర్‌సింగ్, పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం గూడూరు, కంకటావ, ముక్కొల్లు, కప్పలదొడ్డి, శనివారం తరకటూరు, మల్లవోలు, ఉర్దూ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు ఉంటాయని వెల్లడించారు. ప్రతి పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు శిక్షణ తరగతులకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని కోరారు.

హైందవ శంఖారావం కరపత్రాల అందజేత



పెడన: హైందవ శంఖారావ సభను విజయవంతం చేయడానికి ప్రతి హిందువు తరలి రావాలని భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు కోరారు. గురువారం వారు పట్టణంలోని పలు దేవాలయాల కమిటీల సభ్యులను కలిసి కరపత్రాలను అందజేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఐదో తేదీన గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరగనున్న రాష్ట్ర స్థాయి హైందవ శంఖారవ సభకు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు. 2వ వార్డులోని శ్రీగంగాపార్వతీ సమతే ఆగస్త్యేశ్వరస్వామి, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి తదితర ఆలయాల కమిటీలను కలిశారు.

చెరువులకు బహిరంగ వేలం నిర్వహించాలి



తెలుగురావుపాలెం గ్రామసభలో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు

తెలుగురావుపాలెం(ఘంటసాల): పంచాయతీ పరిధిలోని చెరువులకు బహిరంగ వేలం నిర్వహించాలని తెలుగురావుపాలెం గ్రామస్తులు సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబును కోరారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం గ్రామాల్లో సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, గాజుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. తెలుగురావుపాలెం గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోఉన్న చెరువులకు బహిరంగ వేలం నిర్వహించాలని అడిగారు. స్పందించిన సర్పంచ్ ప్రసాద్ బాబు పంచాయతీ చిన్నది కావడంతో ఆర్థిక వెసులుబాటు లేక అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని చెప్పారు. చెరువులు సొసైటీల పరిధిలో ఉండటంతో బహిరంగ వేలం నిర్వహించడం లేదని గ్రామస్తుల విన్నపాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ ప్రసాద్‌బాబు, ఈవో అశ్విన్ కుమార్‌లు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, గ్రామస్తులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అచ్చెంపాలెం గ్రామంలో సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు

ఘంటసాల మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. గ్రామ సభలను ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు.

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలో మెరకనపల్లి శివారు టేకుపల్లి గ్రామానికి సంబంధించి రెవెన్యూ సదస్సును గురువారం సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సదస్సులో రైతు రాయన బిక్షాలు వ్యవసాయ భూమికి పాస్‌పుస్తకం ఇప్పించాలని వినతిపత్రం అందజేసినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. సర్వేయర్ రామకృష్ణ బాబు, వీఆర్వో మోపిదేవి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

6న పైడమ్మ అన్నసమారాధన

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పూర్తయిన పిమ్మట నిర్వహించే అన్న సమారాధన కార్యక్రమం ఈ నెల 5వ తేదీ నుంచి ఆరో తేదీకి మారిందని దేవదాయశాఖ ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీన హైందవ మహాసభ జరగనున్న నేపథ్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని 6వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు పైడమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

కోడూరు: ధనుర్మాసంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో స్వామివారి ఉత్సవమూర్తులకు నవవిధ అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. గోదాదేవి, శ్రీకృష్ణుడికి పుష్పాభిషేకాన్ని కనులపండువగా జరిపారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆక్వా సాగుకు లైసెన్సు తప్పనిసరి

ఫిషరీస్ కమిషనర్ డోలా శంకర్



గరిశపూడి వద్ద చేపను పరిశీలిస్తున్న ఫిషరీస్ కమిషనర్ శంకర్

కృత్తివెన్ను: ఆక్వా సాగు చేసే రైతులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఫిషరీస్ కమిషనర్ డోలా శంకర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గరిశపూడి గ్రామంలో చేపలసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆక్వా రైతుల నుంచి సాగు విధానం ఎలా జరుగుతుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మార్కెటింగ్ పద్ధతి ఏంటి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆక్వా రంగంలో క్షేత్రస్థాయిలో రైతులు ఎటువంటి విధానాల్లో సాగు చేస్తున్నారు, వారు పండించే పంటలో నాణ్యత ఎంత ఉంది, నిషేధ పదార్థాలు మన పంటలో ఉంటున్నాయా మొదలైన విషయాలు తెలియాలంటే తప్పనిసరిగా రైతు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయన రైతులకు సాగు పద్ధతులపై, వచ్చే వ్యాధుల నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎవరిని సంప్రదించాలి. లాభదాయకంగా పంటను ఎలా పండించుకోవాలి అన్న సంగతులు వివరించారు. ఆయన వెంట మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు నాగబాబు, ఎఫ్‌డీవో నాగాంజని, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమౌళి, రైతులు ఉన్నారు.

శ్రీకాకుళేశ్వర దేవస్థానం ఈవోకు సత్కారం

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళేశ్వరస్వామిదేవస్థానంలో జరిగే కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని ముదిరాజుల సంఘం సభ్యులు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం డెప్యూటీ కమిషనర్, ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద రావును శ్రీకాకుళం ముదిరాజుల సంఘ సభ్యులు గురువారం శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ముదిరాజుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చీడపీడలపై తగిన మోతాదులో పిచికారీ చేయాలి



పంటల రకాలు, పోస్టర్లు పరిశీలిస్తున్న రైతులు

మోపిదేవి: వివిధ పంటలపై వ్యాపించే చీడపీడలను గుర్తించి తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలని వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త నవీన్ తెలిపారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. కేవీకే ఘంటశాల, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యాన సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన వివిధ పంటల రకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, కేవికే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, డాక్టర్ సత్యప్రియ లలిత మినుము పంటపై రైతులతో చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ విశ్రాంత శాస్త్రవేత్త కె.నాగేంద్రరావు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, పాఠశాల హెచ్‌ఎం పి.జయంతి, విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు. అనంతరం బాపట్ల కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు రకాల పంటల పోస్టర్స్, మోడల్స్‌ను రైతులు తిలకించారు.

రూ.12.5లక్షలతో గ్రామాల్లో మౌలిక వసతులు

సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ సుధాప్రవీణ్

కోడూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.12.5 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ అత్యవసర పనుల నిమిత్తం రూ.12.5 లక్షల నిధులు కేటాయిస్తూ తీర్మానించినట్లు ఎంపీడీఓ చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభల ద్వారా ఆమోదం పొందిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సాలెంపాలెంలో అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి రూ.కోటి నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీఓ చెప్పారు. తీరప్రాంత గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి పంచాయతీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌కి సంబంధించి అమృత్ సరోవర్ పథకం కింద 25సెంట్ల భూమిలో కొత్త చెరువుల తవ్వకాలకు అవకాశం ఉందని, పంచాయతీలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేస్తున్న పనులను వివరించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనునాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తవ్వుతున్నారు.. ఎప్పుడు పూర్తవుతాయో!



కొడాలి - ఘంటసాలపాలెం మధ్యలో తాడేపల్లి వద్ద జేసీబీతో తవ్వుతున్న రోడ్డు

తాడేపల్లి(ఘంటసాల): సంక్రాంతి నాటికి గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ అంటూ ఆర్భాటంగా పనులు ప్రారంభిస్తున్న కూటమి ప్రభుత్వం ఎప్పుడు పూర్తి చేస్తారో అంటూ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఘంటసాల మండలం కొడాలి నుంచి ఘంటసాల పాలెం వరకు ఉన్న ప్రధాన రహదారిని గురువారం జేసీబీ సాయంతో రోడ్డును తవ్వుతున్న పనులు నిర్వహించారు. మండలంలో కొంతకాలం క్రితం కొన్ని రోడ్లపై కంకర, చిప్స్ వేసి వదిలేశారని దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. అవి పూర్తి కాకుండానే కొడాలి నుంచి ఘంటసాల వయా ఘంటసాలపాలెం వరకు ప్రధాన రహదారిని జేసీబీతో గుంతలు తవ్వుతున్నారు. ఈ రోడ్డు ఎప్పుడు పూర్తి చేస్తారో అంటూ పలువురు అంటున్నారు. తవ్విన రోడ్లను రోలర్‌తో తొక్కిస్తే కొంతమేర ఇబ్బందులు తొలుగుతాయంటున్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 4వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.స్వర్ణభారతి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో 'శ్రీకాకుళం' విద్యార్థిని ప్రతిభ



మెమెంటో అందుకుంటున్న శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్ విద్యార్థిని హన్సిక ఫణిదేవి

శ్రీకాకుళం(ఘంటసాల): వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటి కృష్ణా జిల్లాలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్‌కు గర్వకారణమని ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో గురువారం నిర్వహించిన కృష్ణా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఘంటసాల మండలం శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని టి.హన్సిక ఫణిదేవి ఫింగర్ ప్రింట్ బేస్‌డ్ కార్ డిటెక్టర్‌ను ప్రదర్శించి వ్యక్తిగత విభాగంలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. దీంతో త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. హన్సిక ఫణిదేవికి డీఈవో పీవీజే రామారావు, హెచ్‌ఎం అనుపల్లవి భువనేశ్వరి చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గుడివాడ డీవైఈవో పద్మారాణి, డీసీఈబీ సెక్రటరీ జాన్ సాహెబ్, ఘంటసాల ఎంఈవో 2 మొహమ్మద్ మోమిన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. హన్సిక ఫణిదేవి, గైడ్ టీచర్ వి.బాల సునీతను హెచ్‌ఎం అభినందించారు. వీరికి సహకరించిన ఇతర ఉపాధ్యాయులను, పాఠశాల సిబ్బందిని ఘంటసాల మండల ఎంఈవో 1 ఎస్.శివశంకరరావు, ఎంఈవో 2 మోమిన్, హైస్కూల్ ప్లస్ ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కోడి కోటేశ్వరమ్మ, పులగం రాజేంద్ర, సభ్యులు, గ్రామస్తులు, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి



మెరిట్ విద్యార్థులకు నగదు అందిస్తున్న పిచ్చేశ్వరావు, హెచ్‌ఎం వేణుగోపాలరావు

గోగినేనిపాలెం(ఘంటసాల): ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు డాక్టర్ పిన్నమనేని లెనిన్ అందిస్తున్న ఆర్థికసాయం విలువైనదని పేరెంట్స్ కమిటీ కో ఆప్షన్ సభ్యుడు మల్లంపాటి పిచ్చేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో 2017–18, 2018–19 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు పిన్నమనేని వెంకయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పిన్నమనేని లెనిన్ రూ.50 వేలు నగదు సహకారం అందించారు. 017–18లో ప్రతిభ కనబర్చిన గంధ్ర నవ్యకు రూ.20 వేలు, 2018–19లో విద్యార్థిని వేములమడ స్వాతికి రూ.30 వేల నగదును హైస్కూల్ కోఆప్షన్ సభ్యులు పిచ్చేశ్వరావు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, పిచ్చేశ్వరరావులు మాట్లాడారు.

ఆర్టీసీ డిపో తనిఖీ



అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపోని విజయవాడ జోన్ ఈడీ జి.విజయరత్నం గురువారం తనిఖీ చేశారు. డిపోలోని అన్ని విభాగాలను ఆయన పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడి బస్ సర్వీసుల గురించి తెలుసుకున్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఉద్యోగాల నియామకాలకు సంస్థ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం హనుమంతరావు, పలువురు అధికారులు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]